


మన **భానుపురి**

ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం




శనివారం 20 జూన్ 2026 ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం పేజీలు :- 2

# డాక్టర్లు నిరంతరం పేషేంట్లకు అందుబాటులో ఉండాలి






భానుపురి /సూర్యాపేట ప్రతినిధి

వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండి హాస్పిటల్ కు వచ్చే రోగులకు మెరుగైన చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. సూర్యాపేట జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఎమర్జెన్సీ వార్డులు, ఇన్-పేషెంట్ మరియు అవుట్-పేషెంట్ విభాగాలను ఆయన స్వయంగా పరిశీలించారు. వార్డులలోని రోగులతో కలెక్టర్ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రావణ్, ఆర్ఎమ్ఓ, వివిధ విభాగాల హెచ్.ఓ.డిలతో సమావేశమై, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ప్రత్యేకంగా చర్చించారు. జనవరి నెల నుండి మే నెల వరకు ఆసుపత్రికి దాదాపు 1,12,000 కంటే ఎక్కువ మంది అవుట్-పేషెంట్లకు, అలాగే 25,000 పైగా ఇన్-పేషెంట్లకు వైద్య సేవలు అందించినట్లు కలెక్టర్ తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ప్రోగ్రాం కింద ఆసుపత్రిలో మోకాలి మార్పిడి, ఇతర ఆర్థోపెడిక్ శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రేడియాలజీ, గైనకాలజీ విభాగాల సేవలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, ముఖ్యంగా ఇక్కడి మాత శిశు కేంద్రంలో గైనకాలజీ విభాగం ఆధ్వర్యంలో ప్రసవాల సంఖ్య పెరిగినట్లు వెల్లడించారు. ఆసుపత్రికి వచ్చే రోగులందరికీ ఉచితంగా నాణ్యమైన వైద్యంతో పాటు, మందులను కూడా అందిస్తున్నామని స్పష్టం చేశారు.క్యాన్సర్ రోగులకు అండగా పేలియేటివ్ కేర్, కీమోథెరపీ క్యాన్సర్ బాధితుల కోసం ఆసుపత్రిలో ప్రత్యేకంగా యూనిట్‌ను ఏర్పాటు చేసి, వారికి కీమోథెరపీతో పాటు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం దాదాపు 58 మంది క్యాన్సర్ రోగులు ఈ సేవల ద్వారా లబ్ధి పొందుతున్నారని ఆయన వివరించారు. త్వరలోనే నూతన భవనాలు అందుబాటులోకి ఆసుపత్రి ఆధునీకరణ లో భాగంగా నూతనంగా నిర్మించిన మాతా శిశు సంరక్షణ బ్లాక్ భవన నిర్మాణం పూర్తయిందని, దానికి సంబంధించిన మిగిలిన ఎక్విప్‌మెంట్, ఇతర పనులను త్వరలోనే పూర్తి చేసి వినియోగంలోకి తెస్తామని ప్రకటించారు. అలాగే దీని పక్కనే నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నూతన ప్రధాన భవన పనులు కూడా చివరి దశకు చేరుకున్నాయని, వీటిని వేగవంతంగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని మెడికల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డిపార్ట్‌మెంట్ ఇంజనీర్లను ఆదేశించినట్లు తెలిపారు. ఆసుపత్రికి వచ్చే ఇన్-పేషెంట్లకు వైద్యంతో పాటు నాణ్యమైన భోజనాన్ని అందించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.కార్యక్రమం లో సూపరింటెండెంట్ శ్రవణ్ కుమార్, ఆర్ఎంఓ లు గీతా వాణి, ప్రశాంతి, డాక్టర్స్ మనీషా, సతీష్, ఉపేందర్ సింగ్, మునిసిపల్ కమీషనర్ హనుమంత్ రెడ్డి,మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు

భానుపురి /సూర్యాపేట టౌన్




రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూర్యాపేట ఎస్‌హెచ్‌ఓ వెంకటయ్య సూచించారు. సాంకేతికత విస్తరిస్తున్న కొద్దీ సైబర్ నేరగాళ్లు కొత్త మార్గాల్లో ప్రజలను మోసం చేస్తున్నారని ఆయన హెచ్చరించారు. మొబైల్ ఫోన్లకు తెలియని నెంబర్ల నుంచి వచ్చే లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయవద్దని ఎస్‌హెచ్‌ఓ స్పష్టం చేశారు. బహుమతులు గెలుచుకున్నారంటూ వచ్చే ప్రకటనలు, బ్యాంకు ఖాతాల వివరాలు అడిగే కాల్స్ పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇలాంటి లింకులు క్లిక్ చేయడం వల్ల వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతాల వివరాలు నేరగాళ్ల చేతికి చేరే ప్రమాదం ఉందని తెలిపారు. యువత ఈజీ మనీ కోసం ఇన్‌స్టంట్ లోన్ యాప్‌లను ఆశ్రయిస్తున్నారని, రుణాలు తీసుకున్న చాలా మంది సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకుని ఇబ్బందులు పడుతున్నారని వెంకటయ్య పేర్కొన్నారు. వ్యక్తిగత ఫోటోలు, ఫోన్ కాంటాక్టులను దుర్వినియోగం చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని, తల్లిదండ్రులు పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలపై దృష్టి పెట్టాలని సూచించారు.రహదారి భద్రత విషయంలో తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని ఎస్‌హెచ్‌ఓ కోరారు. సూర్యాపేట పట్టణ పరిధిలో మైనర్లకు ద్విచక్ర వాహనాలు లేదా ఇతర మోటారు వాహనాలు నడపడానికి ఇచ్చినట్లు గుర్తిస్తే సంబంధిత తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడపడం వల్ల ప్రమాదాల ముప్పు పెరుగుతోందన్నారు.సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై ప్రజలకు పూర్తి అవగాహన ఉండాలని, అనుమానాస్పద ఘటనలు ఎదురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్‌హెచ్‌ఓ వెంకటయ్య విజ్ఞప్తి చేశారు.

# జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్





భానుపురి /సూర్యాపేట ప్రతినిధి

జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు టెక్స్ట్ బుక్స్, కంప్యూటర్ ల్యాబ్‌ను సందర్శించి, విద్యార్థులకు అందుతున్న డిజిటల్ విద్యపై ఉపాధ్యాయులను వివరాలు అడిగారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును తెలుసుకోవడానికి కిచెన్ షెడ్‌ను, పాఠశాలలోని టాయిలెట్లను తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు.అనంతరం పదవ తరగతి గదిలోకి వెళ్ళిన కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అక్కడ కాసేపు ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థిని, విద్యార్థులతో ముచ్చటించారు. వారి చదువుల తీరును, భవిష్యత్తు లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల భాషా నైపుణ్యాలను పరీక్షించడానికి స్వయంగా వారి చేత తెలుగు టెక్స్ట్ బుక్ చదివించారు. స్పష్టమైన ఉచ్చారణతో చదివిన విద్యార్థులను ఆయన అభినందించారు. పదవ తరగతి విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని, పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ ఈ సందర్భంగా ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ప్రధానోపాధ్యాయురాలు పద్మ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడిని అరికట్టాలి

భానుపురి /సూర్యాపేట టౌన్



విద్యార్థుల నుండి విచ్చలవిడిగా అక్రమ పద్ధతులలో దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేటు విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం పార్టీ వన్ టౌన్ కార్యదర్శి వల్లపు దాసు సాయికుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం సూర్యాపేట పట్నంలోని 23వ వార్డులో నిర్వహించిన సిపిఎం పార్టీ శాఖ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూర్యాపేట పట్టణంలో ప్రైవేటు విద్యా సంస్థల దోపిడీ రోజురోజుకు పెరుగుతుందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు, నోట్ బుక్స్, బెల్టు, షూస్ నిబంధనలకు విరుద్ధంగా అమ్ముతూ బలవంతంగా దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజుల దోపిడీని, కళాశాలలలో జరుగుతున్న అక్రమ దోపిడీని అరికట్టాల్సిన విద్యా శాఖ అధికారులే నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్న విద్యాసంస్థలను సిజ్ చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులుసిహెచ్ మల్లయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఎం నాయకులుపుష్పలత, ఒగ్గు ఉమ, మహేష్,లక్ష్మమ్మ, సోమయ్య, శాంత తదితరులు పాల్గొన్నారు.

# 12వ అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని విజయవంతం చేయండి






**-యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం**

**-ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ నల్గొండ డి ఈ. డి ప్రభాకర్**

భానుపురి /సూర్యాపేట టౌన్

యోగాతోని సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని నల్గొండ ఎలక్ట్రిసిటీ డి. ఈ. డి ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని సూర్యాపేట ఉన్నత యోగా శిక్షణా కేంద్రం ఆధ్వర్యంలో యోగ పై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ర్యాలీ ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరికి నిజజీవితంలో యోగ ఎంతో అవసరం అని తెలిపారు. మనిషి ఆరోగ్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చు అన్నారు. ఎంజీ రోడ్డు లోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నుండి ప్రారంభమైన ర్యాలీ కొత్త బస్టాండ్, వాణిజ్య భవన్ సెంటర్, శంకర్ విలాస్ సెంటర్, ఈద్గా రోడ్డు మీదిగా ర్యాలీ నిర్వహించారు. సూర్యపేట ఉన్నత యోగా శిక్షణ కేంద్రం శిక్షకులు చాడ పాపిరెడ్డి ఆధ్వర్యంలో 100 మంది తో ర్యాలీ నిర్వహించారు. యోగా గురువు చాడపాపిరెడ్డి మాట్లాడు తూ వేల సంవత్సరాల క్రితం భారతదేశంలో ఉద్భవించిన యోగ శారీరక మానసిక, ఆధ్యాత్మిక సాధనల కలయిక అన్నారు .ఈ యోగా 19 శతాబ్దపు చివర నుండి ప్రపంచవ్యాప్తంగా విస్తరించిం దన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ యోగ ప్రాముఖ్యతను గుర్తించి ఐక్యరాజ్యసమితిలో 2014 సెప్టెంబర్ 27న సర్వసభ్య సమావేశంలో ప్రతిపాదించడం జరిగినది అన్నారు. ఆనాటి నుండి అంతర్జాతీయ యోగ దినోత్సవం ప్రతి సంవత్సరం జూన్ 21న జరుపుకొనుటకు ప్రతిపాదన చేయగా ఈ తీర్మానానికి 193 దేశాల6 ప్రతినిధులలో 175 మంది మద్దతు తెలిపారు అన్నారు. ఆనాటి నుండి యోగాను ప్రపంచవ్యాప్తంగా తీసుకెళ్ల డానికి మార్గం సుగమైన శుభమైనది అన్నారు. జూన్ 21 2015 నుండి గత 11 సంవత్సరాలుగా ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ దినోత్సవం జరుపు కుంటున్నాముఅని, ప్రస్తుతం 12వ అంతర్జాతీయ దినోత్సవాన్ని ఈనెల 21 ఆదివారం ఉదయం 6 గంటలకు బ్రాహ్మణ కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంత్ నిరంకార సంస్థ జిల్లా అధ్యక్షురాలు కడారి సరళ ,యోగ సాధకులు వీ లింగయ్య, మల్లారెడ్డి, గోరెంట్ల శ్రీనివాస్, సుధాకర్, వెంకన్న, శ్రీధర్, మురళీకృష్ణ, లక్ష్మీనారాయణ వెంకన్న, శ్రీధర్, సుదర్శన్ రెడ్డి మంజుల, బాణాల శ్రీనివాస్ చారి కృష్ణారెడ్డి, పాల్వాయి పద్మ, కళ్యాణి రజిత,ఉమ, సుజాత, శ్రీదేవి, ధనలక్ష్మి సంధ్య, కవిత,సరిత,జ్యోతి, జాల వెంకట్ రెడ్డి,వెంకటేశ్వర్లు, వెంకన్న, సేచా చారి నిర్మల, రాజేశ్వరి, లక్ష్మి, జయలక్ష్మి, నాగరాజు శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## దేశ భవితకు దిక్సూచి రాహుల్ గాంధీ



భానుపురి /సూర్యాపేట టౌన్

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ దేశ భవితకు దిక్సూచి అని, ఆయనను భావి భారత ప్రధానిగా చూడడమే యావత్ దేశ ప్రజల ఆకాంక్ష అని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి పేర్కొన్నారు. రాహుల్ గాంధీ గారి 56వ జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కరీముల్లా బేగ్ జావేద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రోగులకు బ్రేడ్, పండ్ల పంపిణి కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హాజరైన ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మున్సిపల్ చైర్ పర్సఅ మొరిశెట్టి నివేదిత లక్షాది లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ.. దేశ సమగ్రత, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అలుపెరగని పోరాటం చేస్తున్న రాహుల్ గాంధీ త్వరలోనే ప్రధాని పీఠాన్ని అధిరోహించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

## సాయిబాబా దేవాలయంలో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు







భానుపురి /సూర్యాపేట కల్చరల్

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సాయి నగర్ గల శ్రీ సాయిబాబా మందిరంలో శుక్రవారం 25వ వార్షికోత్సవ ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ నాయకులు రామిరెడ్డి సర్వోత్తమ రెడ్డి, మునిసిపల్ చైర్ పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్ష్యాది లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని, ఆధ్యాత్మిక భావనతోనే మానసిక ప్రశాంతత, జీవన సంతృప్తి లభిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో నిర్వహించినచండీ హోమం, రుద్ర హోమం, పంచసూక్త హోమ కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ మోరిశెట్టి నివేదిత మాట్లాడుతూ సూర్యాపేట పట్టణం ఆధ్యాత్మిక సంప్రదాయాలకు నిలయమని, ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాల కోసం ఆలయాల్లో నిర్వహించే హోమాలు, పూజలు అభినందనీయమని పేర్కొన్నారు. సాయి బాబా ఆలయంలో 25వ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీని అభినందించిన ఆయన, ఆలయ అభివృద్ధి కార్యక్రమాలకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య, సాయిబాబా దేవాలయ కమిటీ అధ్యక్షుడు కర్నాటి రవి కోశాధికారి పోతుగంటి మల్లికార్జున్ భక్తులు రాచర్ల వెంకటేశ్వరరావు, చల్లా లక్ష్మీకాంత్, రాచర్ల కమలాకర్, తల్లాడ వెంకటేశ్వర్లు మందిర అర్చకులు వలివేటి విశ్వేశ్వర శర్మ, గంగాధర శర్మ తదితరులు పాల్గొన్నారు.

## దేశ భవితకు దిక్సూచి రాహుల్ గాంధీ



భానుపురి /సూర్యాపేట టౌన్

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వాణిజ్య భవన్ సెంటర్ లో నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కరీముల్లా బేగ్ జావేద్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ గారి జన్మదిన వేడుకలకు ముఖ్య అతిధిగా హాజరైన శాసన మండలి సభ్యులు శంకర్ నాయక్ ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి పిసిసి ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్యమున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ, సామాజిక న్యాయం, యువత రైతుల సంక్షేమం కోసం రాహుల్ గాంధీ నిరంతరం పోరాడుతున్న నాయకుడని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశంలో ప్రజల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఎమ్మెల్సీ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గారు మాట్లాడుతూ దేశ ఐక్యత, సామాజిక న్యాయం, యువత సాధికారత కోసం రాహుల్ గాంధీ చేస్తున్న కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి నేరుగా ప్రజల మధ్యకు వెళ్లే నాయకత్వం ఆయనదేనని అన్నారు. తెలంగాణలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా మంత్రివర్యులు ఉత్తమన్న నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్ నాయుడు, జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధ, మున్సిపల్ కౌన్సిలర్లు, యువజన కాంగ్రెస్, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, సేవాదళ్, అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగులకు జులై 1 నుంచి 11% ఫిట్‌మెంట్ అమలు!



భానుపురి /హైదరాబాద్

ఆర్టీసీ ఉద్యోగులకు జులై 1 నుంచి 11% ఫిట్‌మెంట్ అమలు చేయనున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. సచివాలయంలో ఆర్టీసీ పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై గురువారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో ఈ ప్రకటన చేశారు. గుర్తింపు సంఘాల ఎన్నికల ప్రక్రియను త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. గతంలో ఆర్టీసీ సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఆర్పీఎస్-2021కు సంబంధించిన 11% ఫిట్‌మెంట్‌ను అమలు చేయనున్నట్లు మంత్రి అధికారికంగా వెల్లడించారు.

## విద్యతోనే ఏదైనా సాధ్యం





భానుపురి /సూర్యాపేట టౌన్

ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందని ప్రముఖ డాక్టర్ 18 వ వార్డు కౌన్సిలర్ వూర రామ్మూర్తి యాదవ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని 18 వ వార్డు విజయ కాలనీలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ బుక్స్, టెక్స్ట్ బుక్స్ పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 250 కోట్లకు పైగా వ్యయంతో ఇంటిగ్రేటెడ్ స్కూలు ఏర్పాటు చేసి బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తుందని తెలిపారు. అదేవిధంగా రాష్ట్రప్రభుత్వం వైద్యాన్ని కూడా పెద్దపీట వేస్తుందన్నారు. విద్యతోనే ఏదైనా సాధ్యమని విద్యార్థులు గ్రహించి ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని ఆ దిశగా క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. తల్లిదండ్రులు విద్యార్థుల ఆహార నియమాలు సైతం జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యంగా జంక్ ఫుడ్ ను దూరంగా ఉంచాలని తెలిపారు. బాల్యంలోనే దీర్ఘకాలిక రోగాలకు కారణమైన కూల్ డ్రింక్స్ బేకరీ ఫుడ్ స్వీట్స్ పిల్లల చేత తినిపించవద్దని తెలిపారు. విద్యార్థుల జ్ఞాపక శక్తికి, ఎదుగుదలకు అవసరమైన ఆహారాన్ని అందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని ముఖ్యంగా కోడిగుడ్డు, జావా వంటి వాటిలో అధిక పోషకాలు ఉంటాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల లో ప్రస్తుతం విద్యార్థులకు మెరుగైన వసతులు ఉన్నాయని తల్లిదండ్రులు తలకు మించిన భారంతో కార్పొరేట్ స్కూళ్లకు పరిగెత్తకుండా ప్రభుత్వ బడులు చేర్పించి విద్యార్థుల భవిష్యత్తును బంగారంల తీర్చిదిద్దాలన్నారు. తన వంతు సహాయంగా కార్పొరేట్ పాఠశాలల్లోని విద్యార్థులకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు త్వరలోనే టై బెల్ట్ షూ అందిస్తానని తెలిపారు . విద్యార్థుల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించి కంటి, దంత పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో సైతం అడ్మిషన్ల కోసం క్యూ కట్టే విధంగా రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన సౌకర్యాలు ఉత్తమ బోధన అందిస్తుందన్నారు. విజయ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రీ ప్రైమరీ క్లాసెస్ ఏర్పాటు చేయడం జరిగిందని తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చంద్రు నాయక్ పాఠశాల హెచ్‌ఎం కొంపెల్లి సుశీల వార్డ్ అధికారి నాగార్జున నాయకులు కరుణాకర్ రెడ్డి, ధరావత్ నిఖిల్, వంశీ, ప్రేమ్ కుమార్, పుష్ప,రమేష్,చాంప్ల, సైదులు ఆర్పి శైలజ పాల్గొన్నారు.

## సూర్యాపేట జిల్లా కేంద్రాన్ని సురక్షిత పట్టణంగా తీర్చిదిద్దుతాం





భానుపురి/ సూర్యాపేట ప్రతినిధి

జిల్లాలోని పోలీస్ స్టేషన్ల వార్షిక తనిఖీల్లో భాగంగా సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ శుక్రవారం సూర్యాపేట 1వ పట్టణ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, క్షేత్రస్థాయిలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న ఎస్పీ డీఎస్పీ ప్రసన్నకుమార్, పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, ఎస్సైలు సిబ్బంది ఘనంగా స్వాగతం పలికి, గౌరవ వందనంతో స్వాగతం తెలిపినారు. అనంతరం సిబ్బంది నిర్వహించిన కవాతును పరిశీలించిన ఎస్పీ వారి యూనిఫామ్స్ కిట్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో వ్యక్తిగతంగా మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వనమహోత్సవ కార్య్ర కమంలో భాగంగా పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఎస్పీ మొక్కలు నాటారు. అనంతరం స్టేషన్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి, స్టేషన్‌లోని వివిధ రకాల కీలక రికార్డులను, శాంతిభద్రతల నిర్వహణ ఫైళ్లను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. పిర్యాదులు, కేసులు పెండింగ్ ఉంచకుండా త్వరితగతిన పూర్తి చేయాలి, కోర్టులతో సమన్వయంగా పని చేసి ఎక్కువ కేసుల్లో శిక్షలు అమలయ్యేలా కృషి చేయాలని అన్నారు. బాధితులకు రక్షణ, భద్రత కల్పించడం ప్రాథమిక విధి, బాధ్యత అన్నారు. సిబంది విధులను పర్యవేక్షణ చేయాలి సమర్థవంతంగా పని చేసేలా నైపుణ్యాలను వృ ాలను అన్నారు. జిల్లా కేంద్రంలో అప్రమత్తంగా ఉంటూ నేరాలను పటిష్టంగా నిరోధించాలని అన్నారు,

**-20 సీసీ కెమెరాల ప్రారంభం:**

ప్రజల రక్షణ మరియు ట్రాఫిక్ నియంత్రణను మరింత బలోపేతం చేయడంలో భాగంగా పట్టణ కేంద్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన మరో 20 సీసీ కెమెరాలను ఎస్పీ ప్రారంభించారు. వీటిని తక్షణమే కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా కేంద్రాన్ని అత్యంత సురక్షిత పట్టణంగా మార్చడమే మా ప్రాధాన్యత. ముఖ్యంగా మహిళల, విద్యార్థినుల భద్రతకు మేము అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాము. మహిళలను వేధించే వారిపై, ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం పాఠశాలలు, విద్యాసంస్థలు ప్రారంభమైనందున, విద్యార్థినుల భద్రత పట్ల అవగాహన కల్పించేందుకు విద్యాసంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము. పోలీస్ సేవలను ప్రజలకు మరింత సులభతరం చేసేందుకు సరికొత్త విధానాన్ని అమలు చేస్తున్నాం. ప్రజల నుండి ఏదైనా ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు నేరుగా బాధితుల ఇళ్లకు వెళ్లి ఫిర్యాదులను స్వీకరిస్తున్నారు. అక్కడికక్కడే కేసులు నమోదు చేసి తక్షణ సహాయం అందిస్తున్నాం. దీనివల్ల బాధితులు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, వారి ఇంటి వద్దకే పోలీసు సేవలను చేరవేస్తున్నాం.'' ప్రజలకు ఇబ్బందులు కలిగించే రౌడీషీటర్లు, భూకబ్జాదారులు, చట్టవ్యతిరేక పనులకు పాల్పడే వారిపై పూర్తిస్థాయి నిఘా ఉంచుతాం. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు. అలాగే పట్టణంలో ట్రాఫిక్ సమస్యల నివారణకు ప్రత్యేక నివారణ ప్రణాళికను సిద్ధం చేసి అమలు చేస్తున్నాం.ఈ వార్షిక తనిఖీ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ మగ్దూం అలీ, ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం, ఎస్సైలు ఏడు కొండలు, మహేందర్, శివతేజ, సందీప్, వెంకన్న, రహిముద్దీన, ఏఎస్సై శంకర్, మరియు స్టోర్ ఆర్ఎస్ఐ అఖిల్, డిసిఆర్బి సిబంది ఎస్ఐ యాకూబ్, ఏఎస్ఐ అంజన్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ శేఖర్ రెడ్డి, సీసీ సందీప్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎడవల్లి చంద్రశేఖర్ రెడ్డి



భానుపురి గరిడేపల్లి

గరిడేపల్లి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎడవల్లి చంద్రశేఖర్ రెడ్డి నియామక ఉత్తర్వులను బిజెపి జిల్లా పార్టీ అధ్యక్షురాలు చల్లా శ్రీలత రెడ్డి వారిని నూతనంగా జిల్లా కార్యవర్గ సభ్యులుగా నియమించడం జరిగినది బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు కుక్కడకు వెంకటేశ్వర్లు గౌడ్ ఆధ్వర్యంలో వారికి ఘనంగా సన్మానం చేయడం జరిగినది ఎడవల్లి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో బిజెపి బలోపేతానికి కృషి చేస్తానని చెప్పడం జరిగినది వారికి ఈ సందర్భంగా ఘనంగా సన్మానం చేసి స్వీట్లు పంపిణీ చేయడం జరిగినది ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఓబిసి జిల్లా నాయకులు జెనిగలశ్రీనివాస్ గౌడ్ , జిల్లా కౌన్సిలింగ్ నెంబరు నర్సింగ్ అంజయ్య ,జిల్లా నాయకులు రావుల ఆంజనేయులు గౌడ్ , మండల సీనియరూ నాయకులు తాళ్ల నరేష్ ,మండల ప్రధాన కార్యదర్శి కాంపాటి రాజు, మండల ఉపాధ్యక్షులు నర్సింగ్ నాగ సైదులు, తెలగొర్ల వీరబాబు, అనంత్ వెంకటేశ్వర్లు, మామిడి సత్యనారాయణ, సీనియర్ నాయకులు గుగులోతు రాజు నాయక్ ,తదితరులు పాల్గొన్నారు